



'కోటంరెడ్డి'కి హైకోర్టులో చుక్కెదురు..


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. టిడిపి నేత మాతంగి కృష్ణపై దాడి కేసులో పోలీసులు అరెస్టు చేస్తున్నారు.నాలుగు నెలల క్రితం వైసిపి నాయకులు, కార్యకర్తలు మాతంగి కృష్ణపై దాడి చేశారు. ఆ సమయంలో ఆయన 25మందిపై ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పోలీసులు ఆ కేసును పక్కపెట్టారు. తాజాగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపికి దూరమయ్యారు. తాను టిడిపిలో చేరుతానని ప్రకటించారు. కోటంరెడ్డిపై ఉన్న పాత కేసులను పోలీసులు బయటకు తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాతంగి కృష్ణపై దాడి చేసిన పలువురిని అరెస్టు చేశారు. ఈ కేసులో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎ 8గా చేశారు. కోటంరెడ్డిని అరెస్టు చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ దాడిలో తన ప్రమేయం లేదని, తనపై ఉన్న కేసును కొట్టేయాలని కోటంరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. గురువారం హైకోర్టు జడ్జి కేసును కొట్టివేయడం కుదరదని విచారణ జరగుతుందని తెలిసింది. కోటంరెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది.

రామ్.. సుక్కు.. మధ్య అగ్గి..!

కావలి రామ్ లక్ష్మణ్‌లంటూ హడావుడి చేసిన ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంసి ఛైర్మన్ ఎం.సుకుమార్‌రెడ్డి మధ్య అగ్గి రాజుకుంది. గ్రావెల్ మాఫియా, రియల్ ఎస్టేట్, ఇందిరమ్మ స్థలాలు కొనుగోళ్లు ఒక్కటేమిటి కావలి నియోజకవర్గాన్ని జరిగిన అవినీతి, అక్రమాల్లో ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపించింది. ఇప్పుడు ఒక్కసారిగా ఇద్దరు ఎడముఖం పెడముఖంగా మారారు. సుకుమార్‌రెడ్డిని వైసిపికి దూరం చేశారు. ఆయనతో ఏం సంబంధం లేదని, అంతా తానేనని ఎంఎల్ఎ బహిరంగంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సుకుమార్‌రెడ్డి కావలిలో కనిపించడం లేదు. వైసిపి నేతలు, అధికారులు ఆయనకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఇది ఆర్థిక లావాదేవీల కారణంగా జరిగిన వివాదంగా కొందరు చెబుతున్నారు. సుకుమార్‌రెడ్డి అవినీతి మరక తనకు అంటకూడదని ఎంఎల్ఎ బయట పెట్టినట్లు కొందరు చెబుతున్నారు. కావలి వైసిపిలో రగులుతోన్న అసంతృప్తి జ్వాలను అధిష్టానం ఏం చేస్తుందో చూడాలి..

- ◆కావలి వైసిపిలో అసంతృప్తి జ్వాల
- ◆ఆర్థిక లావాదేవీలా..వ్యూహాత్మకమా..
- ◆కావలిలో కనిపించని ఎంఎల్ఎ ఆత్మ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఖర్చు పెట్టలేదు. ఎంఎల్ఎ నుంచి కింద స్థాయి నాయకులు ఇతర వ్యాపారులపై దృష్టిపెట్టారు. జిల్లాలోనే అత్యధిక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు కావలిలో ఉన్నారు. కావలి ఎంఎల్ఎ రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తాను ఎన్నికైన తొలి రోజు నుంచి ఎఎంసి ఛైర్మన్ సుమకుమార్‌రెడ్డికి కావలి రాసిచ్చారని అక్కడ ప్రజలు చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ ఒక్కటేమిటి అన్ని శాఖలపైనా ఆయనదే పెత్తనం. షాడో ఎంఎల్ఎగా పేరు తెచ్చుకున్నారు. అన్ని ఆయనే చక్కపెట్టారు. కావలి నియోజకవర్గంలోని గ్రావెల్‌ను అడ్డదిడ్డంగా తవ్వేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కళ్లకు గంతలు కట్టుకొని ఉండిపోయారు. వందలాది టిప్పర్లు ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్ తరలిస్తున్నా అడిగే దమ్మున్న అధికారి ఒక్కరూ అక్కడ లేరు. జగనన్న కాలనీల పేరుతో రాష్ట్ర వ్యాపితంగా పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేసి పంపిణీ చేసింది. కావలి ప్రాంతంలో భారీ కుంభకోణం జరిగింది. ఎకరా రూ.15 లక్షలు ఉండగా, సుకుమార్‌రెడ్డి అండ్ బ్యాచ్ దానికి రూ.45 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాని


రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్ఎ


ఎం సుకుమార్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్, కావలి

డిమాండ్ చేశారు. సాధారణ జనం నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి, దానిని ప్రభుత్వానికి అమ్మకానికి పెట్టారు.కలెక్టర్ అందుకు అడ్డుకట్టవేయడంతో ఆయనపైనే అధిష్టానానికి ఫిర్యాదు చేసి, ఇక్కడ నుంచి వెళ్లిపోడానికి కారణమయ్యారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ వినోద్‌కుమార్ చేత సంతకం చేయించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. బిట్రగుంట, అల్లూరు, కావలి ప్రాంతాల్లో వందలాది టిప్పర్లు పెట్టి గ్రావెల్ తరలించారు. యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎంఎల్ఎ దయాదాక్షిణ్యాలతో పోస్టింగ్‌లు తెచ్చుకున్న అధికారులు గురుభక్తి చాటుకున్నారు. ఇక కావలి చుట్టుపక్కల ప్రభుత్వ భూములతో కలిపి, పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించారు. నుడా అనుమతి లేకుండానే వందల కోట్ల రూపాయల వ్యాపారాలు చేశారు. కావలి నియోజకవర్గంలో సెటిల్‌మెంట్ కేంద్రంగా మారింది. ఇదే అంశం వైసిపి అధిష్టానం వద్ద రికార్డు ఉంది. ప్రజల్లోనూ ఎంఎల్ఎ, సుకుమార్‌రెడ్డి కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడు తున్నారంటూ ప్రజల్లోనూ పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కావలిలో ప్రత్యేక రెవెన్యూ, పోలీసు చట్టాలు అమలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ప్రజల్లో వైసిపి, నేతలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తిలు కనిపి సు_న్నాయి..ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త అభ్యర్థి రంగంలో ఉంటారని ప్రచారం సాగుతోంది..

రామ్..సుక్కు.. మధ్యఅగ్గి..!

కావలి ఎంఎల్ఎ రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మధ్య అగ్గిరాచుకుంది.కొద్ది రోజులుగా ఈ వివాదం తారా స్థాయికి చేరింది. సుకుమార్‌రెడ్డి తనకు ఏలాంటి సంబందమూ లేదంటూ ఎంఎల్ఎ సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చెబుతున్నారు. ఇటీవల అల్లూరు, కావలిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, ఎవరికైనా పనుంటే తనవద్దకు నేరుగా రావాలని ఎవరితో (సుకుమార్‌రెడ్డి)తో పనిలేం దంటూ కార్యకర్తలకు తెలిపారు. అధికారులకు కూడా ఆదే సందేశం ఇవ్వడంతో అల్లూరు మండలం, నార్త్ ఆమూలూరులో గ్రావెల్ పూర్తిగా నిలిచిపోయింది. నియోజకవర్గంలో సుకుమార్‌రెడ్డి టిప్పర్లు తిగడం లేదు. ఇటీవల కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో సుకుమార్‌రెడ్డి అల్లుడు, కుమారుడును రెండు గంటల పాటు ఓ కేసు విషయంలో కూర్చోపెట్టినట్లు తెలుస్తోంది. ఏ ఒక్క అధికారి సుకుమార్‌రెడ్డిని దగ్గరకు రానివ్వదని , పార్టీ కార్యక్రమాలకు పిలవద్దని, కనీసం ప్లెక్సీల్లో తన బొమ్మ కనిపించ కూడదని ఎంఎల్ఎ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో కొద్ది రోజులుగా సుకుమారుడు కావలిలో కనిపించడం లేదు. కేవలం ఇంట్లోనే ఉంటున్నారని కొందరు చెబుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని వ్యాపారాలు చూసుకుంటున్నారని అందుకే కావలిలో కనిపించడం లేదని కొందరు అంటున్నారు. ఎంఎల్ఎ, సుకుమార్‌రెడ్డి మధ్య ఆర్థిక, రాజకీయ లావాదేవీల కారణంగానే ఆయనను దూరం పెట్టారని తెలుస్తోంది. మరి కొందరు సుకుమార్‌రెడ్డికి ఉన్న చెడ్డపేరు ఎంఎల్ఎకు అంటుకుందనే భయంతో వ్యూహాత్మకంగా ఇలా చేస్తున్నారని చెబుతున్నారు. రామ్, లక్ష్మణ్‌లా ఉన్న ఇద్దరు నేతలు ఇప్పుడు భగ్గు మంటున్నారు. వీరిది ఏ రాజకీయమైనా కావలి ప్రజల్లో మాత్రం ఎంఎల్ఎ, సుకుమార్‌రెడ్డి ఇద్దరు పలుచబడిపోయారని ప్రచారం సాగుతోంది. వైసిపికి ఇక్కడ తీవ్ర వ్యతిరేకత ఈ ఇద్దరి నేతల ద్వార వచ్చిందని అధిష్టానికి నివేదిక వెళ్లినట్లు తెలిసింది. ఏం చేస్తారో చూడాలి.

ఇందుకూరు పేట మహిళా బ్యాంకులో

భారీ గోల్‌మాల్..

పాలకవర్గం పాత్ర

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఇందుకూరుపేట మహిళా సహకార బ్యాంకులో భారీ గోల్‌మాల్ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. గత కొంత కాలంగా మహిళా గ్రూపులకు రుణాలు ఇచ్చి వారి చెల్లించిన తర్వాత బ్యాంకులో జమ చేయకుండా ఇక్కడ కొందరు దిగమింగినట్లు సమాచారం. కొత్తూరులో ఉన్న ఈ బ్యాంకులో గత మూడేళ్ల నుంచి ఇదేరకమైన తంతు జరుగుతున్నట్లు సమాచారం. సుమారు రూ. 2కోట్లలో అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా ఈ అవినీతి బాగోతాన్ని దాచిపెడుతూ వస్తున్నారు. ఉన్నతాధికారులకు తెలవడంతో సహకార సంఘం అధికారులు ఈ బ్యాంకుపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ బ్యాంకు పాలకవర్గ పెద్దలు కీలక పాత్రదారులు.. సూత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. గోప్యంగా సాగుతున్న విచారణలో మరిన్ని వాస్తవాలు వెలుగుచూడనట్లు తెలుసోతంది. మహిళా అభివృద్ధి కోసం, ఆర్థిక పరిపుష్టి కోసం ఉపయోగపడాల్సిన బ్యాంకులు మూడో కంటికి తెలియకుండా అందినకాడికి దోచుకుతింటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జనం డబ్బులు అడ్డదిడ్డంగా దిగమింగుతున్నారు. ప్రభుత్వం లోతుగా విచారణ జరిపితే ఈ అవినీతి బాగోతం మరింత వెలుగుచూసే అవకాశం కనిపిస్తోంది.

రైతులకు న్యాయం చేయండి..


సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిసిన చేవూరు రైతులు

ప్రజాశక్తి -కందుకూరు : రామాయపట్నం పోర్టు పేరుతో తమ భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గుడ్లూరు మండలం లోని చేవూరు ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు రైతులు, నెల్లూరులో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని గురువారం కలిశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం తమ భూములను బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్ని స్తోందన్నారు. గతంలో అనేకసార్లు ప్రజాభిప్రాయ సేకరణ కోసం అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేసినప్పుడు, తాము భూములు ఇచ్చేది లేదంటూ స్పష్టం చేశామని చెప్పారు. అయినప్పటికీ అధికారులు రైతులను భయపెడుతున్నారని వాపోయారు. స్పందించిన చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఈ సమస్యను ఇంటూరి నాగేశ్వరరావు తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకువెళ్లారన్నారు. రైతు ప్రతినిధులు సిహెచ్. శ్రీనివాసులు, మాకనబోయిన ప్రసాదు, పొట్టేళ్ల మురళి, జయరావు, శ్రీనివాసులు, హరిప్రసాద్ తదితరులు పార్టీ నేతలను కలిశారు.

కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి -కందుకూరు : ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్సియల్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నామమాత్రంగా నెలకు రూ. 150 నుంచి రూ. రూ. 200 పెంచడం కంటితుడుపు చర్య మాత్రమేనని, ఆ ధరలతో పౌష్టికాహారం ఎలా అందుతుందని పిడిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ రాజశేఖర్ ఆరోపించారు. కందు కూరులోని ఎన్‌జిఒ హోమ్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడారు. గత 4 ఏళ్ల మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలను బట్టి చూస్తే హై స్కూల్ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3000, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు రూ.4000 పెంచాలన్నారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యూ జిల్లా నాయకుడు ఎం కిషోర్, కందుకూరు డివిజన్ సెక్రెటరీ మహేష్, హర్ష, సుధీర్ పాల్గున్నారు.


మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి -కందుకూరు : తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ నామినేషన్ గురువారం చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు పులివర్తి నాని, ఎంఎల్‌సి దొరబాబు, మాజీ ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు, మాజీ మేయర్ కటారి హేమలత, కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి ఇంటూరి నాగేశ్వరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ తదితరులు హాజరయ్యారు.

టిడిపి సమావేశానికి 'ఇంటూరి' హాజరు

ప్రజాశక్తి -కందుకూరు : నెల్లూరులో గురువారం జరిగిన టిడిపి నెల్లూరు పార్లమెంట్ సమన్వయ కమిటీ సమావేశానికి కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు, ఇంకా పలు విషయాలపై నేతలు చర్చించారు.

మహమ్మద్ యాసిన్‌కు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణ ముస్లిం ఖాజీగా పట్టాన్ మహమ్మద్ యాసిన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలోని ఓవి రోడ్డు ఉత్తరభాగం కొండికందుకూరు, కోవూరు, విక్కిరాలపేట, పందలపాడు, జల్లలమూడి, పలుకూరు తదితర గ్రామాలకు మసీదు ,వివాహాది ఇస్లామీ ధార్మిక కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను ఏపీ మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సెక్రటేరియట్ జిఒను జారీ చేసింది. కందుకూరు ప్రాంతంలో జరిగే కార్యక్రమాలను పఠాన్ మహమ్మద్ యాసిన్‌ను నిర్వహించే విధంగా జీవో విడుదల చేయడం జరిగిందని ముస్లిములు దీనిని గమనించాలని కోరారు.

టిడ్కో గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : పేదలందరికీ శాశ్వత గహాలను అందజేసే ప్రక్రియలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకులనుంచి త్వరితగతిన రుణాలు మంజూరు చేయించాలని మెప్మా విభాగం, నగర పాలక సంస్థ హౌసింగ్ విభాగం అధికారులను కమిషనర్ హరిత సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో అధికారులతో టిడ్కో గహాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ శాశ్వత గహ హక్కు పథకం వర్తించడానికి అవసరమైన గహ రుణాలను అందించి పేదల అభ్యున్నతికి సహకరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల నివాసాలకు అధికారులు వెళ్లి బ్యాంకు రుణాలు తీసుకునేలా చైతన్య పరచాలని కమిషనర్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మెప్మా పిడి రవీంద్ర బాబు, డి.సి.ఓ రామ సుబ్బారావు, నగర పాలక సంస్థ హౌసింగ్ అధికారులు సిద్దిఖ్, సందీప్ పాల్గొన్నారు.

క్యారేజీలు పంపిణీ

పొదలకూరు : పంచాయతీ పరిధిలోని లింగంపల్లి అరుంధతియ వాడలోని ప్రాథ మిక పాఠశాలలో ఇటీవల మరణించిన వెంకటరమణయ్య (కష్ణ) జ్ఞాపకార్థం వారి కుమారులు యశ్వంత్, వెంకటేశ్వర్లు, రాగయ్య, పెంచలయ్య పాఠశాలలోని విద్యార్థులకు భోజన క్యారేజీలు పంపిణీ చేశారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల ప్రాంగణంలో భోజనం ఏర్పాటు చేసి, ఉపాధ్యాయుల చేతుల మీదుగా క్యారేజీలను అందజేశారు.

కన్వీనర్లకు అవగాహన

ప్రజాశక్తి -ఉలవపాడు : సిఎం వైస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నియమింపబడినటువంటి సచివాలయ కన్వీనర్లు, గహసారథుల ఉలవపాడు మండలంలోని పెద్ద పట్టపుపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఉలవపాడు మండలం సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ వెలిచెర్ల ధన కోటి మాట్లాడారు. సర్పంచ్ జయరామ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు పటిష్ట చర్యలు

కమిషనర్ హరిత - సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన


ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

రానున్న వేసవికాలం నీటి ఎద్దడిని దష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా మంచినీటి సరఫరాకు ఏలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులకు సూచించారు. గురువారం స్థానిక 31 వ డివిజన్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ రోడ్డు ప్రాంతంలో పర్యటించారు. చవటగుంట, విజయలక్ష్మి నగర్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డోర్ టు డోర్ చెత్త సేకరణ పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కషి చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న వివిధ వీధుల్లో డ్రైను కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దోమల నిర్మూలనకు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణా చర్యల్లో భాగంగా అన్ని డ్రైను కాలువల్లో ఆయిల్ బాల్స్ పిచికారీ చేయాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ పనులు నిర్వహించాలన్నారు. నగర పాలక సంస్థ అందజేసిన చెత్త బుట్టలలో తడి, పొడి చెత్తను విడిగా తీసి ఉంచాలని, రీ సైక్లింగ్ విధానానికి ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను సందర్శించిన కమిషనర్ మంచినీటి సరఫరా పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువు నీటిని సేకరించిన అనంతరం వివిధ విభాగాలలో జరుగుతున్న మంచినీటి శుద్ధి ప్రాసెసింగ్ విధానాలను నిశితంగా తనిఖీ చేశారు. వేసవికాలంలో మంచినీటి సరఫరాలో తలెత్తే అంతరాయలపై ముందస్తుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ సూచించారు. మంచినీటి పరిశుభ్రతకు ప్రధాన ప్రాధాన్యత కల్పిస్తూ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను సిబ్బంది కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సంపత్ కుమార్, సంజయ్, శేషగిరిరావు ఉన్నారు.

మెరుగైన పారిశుధ్య సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడం సాధ్యమవుతుందని కమిషనర్ హరిత వెల్లడించారు. గురువారం కార్పోరేషన్ కార్యాలయంలో ఆవరణంలో జరుగుతున్న నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు విభాగాల నిర్మాణ స్థాయి అభివద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న కంట్రోల్ కేంద్రంలో నగర వ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల సమావేశాలు, మున్సిపల్ శాఖ ఉన్నతాధి కారులతో సమీక్షలు, విపత్తు నిర్వహణ కేంద్రం, స్పందన పరిష్కార వేదిక, నగర పాలక సంస్థ సమాచార విభాగం వంటి వివిధ కార్యక్ర మాలను నిర్వహించనున్నామని తెలిపారు. నాణ్యమైన ప్రమాణాలతో నిర్మాణాన్ని త్వరి తగతిన పూర్తి చేయాలని అధికారులను కమి షనర్ ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు సంపత్ కుమార్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలుచోట్ల విద్యార్థులకు అవగాహన


నెల్లూరులో...

ప్రజాశక్తి-నెల్లూరు : ర్యాగింగ్‌ను పూర్తిగా నివారించి కళాశాలల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పే క్రమంలో భాగంగా పోలీసు అధికారులు నగరంలోని పలు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, యాజమాన్యాలతో కలిసి విద్యాలయాలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలలో మహిళా చట్టాలు, దిశ యాప్, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాల వాడకం, సైబర్ క్రైమ్స్ ,ట్రాఫిక్ నియమాలు తదితర చట్టాల్ని అతిక్రమించే వారిపై విధించే శిక్షల గురించి క్లుప్తంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలల్లో ఎటువంటి అసాంఘీక కర్యలా పాలు, ర్యాగింగ్ వంటి చోటు చేసుకుం టున్నట్లు గుర్తించినా, విద్యార్థిని విద్యార్థులు అసౌకర్యానికి గురౌతున్నట్లు భావించినా వెంటనే డయల్ 100 లేదా దిశ యాప్, 112 అనే టోల్ ఫ్రీ నంబర్ లను సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కందుకూరు డివిజనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కండే శ్రీనివాసులు ఎస్‌పి ఆదేశాల మేరకు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. డిఎస్‌పి కె శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ మంచి నడవడికను అవలంభిం చుకోవాలని, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. సెల్ ఫోను వాడకము తగ్గించి వ్యసనానికి బానిస కావొద్దు అని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థులకు వ్యాయామం చాలా అవసరమని అవకాశం దొరికినప్పుడు వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ జి వెంకట్రావు, సబ్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ టి సుబ్బారావు పాల్గొన్నారు.


కందుకూరులో...

బలహీన వర్గాలకు పెద్దపీట

ప్రజాశక్తి -కందుకూరు : సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో బిసి, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం అమలు చేస్తున్నారని రాష్ట్ర కష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పాశం కుమారి, ప్రతినిధి పాశం కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన శాసనమండలి జాబితాలో అత్యధికంగా బిసి సామాజిక వర్గాలకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కందుకూరు వైసిపి కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. కొండయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భావజాలంతో దేశంలో ఎక్కడ లేని విధంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కషి చేస్తున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు రూరల్ జెసిఎస్ కన్వీనర్ చీమల వెంకటరాజా, నెల్లూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు జాజుల కోటేశ్వరరావు, గాండ్ల హరి ప్రసాదు, కందుకూరు పట్టణ జే సి ఎస్ కన్వీనర్ ముప్పవరపు కిషోర్, సచి వాలయం కన్వీనర్లు ద్రోణాదుల చైతన్య, దాసరి బాలాజీ, వడ్లమాని శేఖరు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గ వైసిపి సీనియర్ బి.సి నాయకుడు జాజుల కోటేశ్వరరావును జిల్లా బి.సి.సెల్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో అభినందించారు. నాయకులు మాట్లాడుతూ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, నమ్మకంతో భాధ్యతను యిచ్చిన శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది, జేసిఎస్ పట్టణ కన్వీనర్ ముప్పవరపు కిషోర్, సచివాలయం కన్వీనర్లు పాశంకొండయ్య, ద్రోణాదులచైతన్య, దాసరి బాలాజీ, వడ్లమాని.శేఖర్, బి.సి నాయకులు గాండ్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలి

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జనవరి నెలకు సంబంధించి జీతాలు ఇంతవరకు రాలేదని స్థానిక ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఆలస్యంగా బిల్లులు పెట్టడం వల్ల జీతాలు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఆర్థిక సమస్యలు తమకు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. బిల్లులకు సంబంధించిన వివరాలు పంపించడం జరిగిందని బిల్లులు కూడా పాస్ అయ్యాయని త్వరలో వస్తాయని ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ తెలిపారు.

పటిష్టంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి-నెల్లూరు : ఈ నెల 25 నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం నగరంలోని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి కార్యాలయంలో పరిపాలనా విభాగం అధికారిని కలిసి ఈ మేరకు పిడిఎస్‌యు నాయకులు వినతిపత్రం అందజేశారు. పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ అన్ని కాలేజీలకు సెల్ఫ సెంటర్లు కేటాయించడం వల్ల కొన్ని కార్పొరేట్ కాలేజీలు యాజమాన్యాలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్ పరీక్షలను సిసి కెమెరాల నీడలో నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించి అవినీతి అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు నాయకులు రామోజీ, విష్ణు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-నెల్లూరు : పిఎంపి అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నియామకంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన షేక్ షాహినా బేగంను సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జ్యోతినగర్ ప్రాంతంలోని వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాల యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరావస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడిన తరువాత సచివాలయ మహిళా పోలీసుల సేవలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని తెలిపారు. పిఎంపి గౌరవ అధ్యక్షులు అనుమల జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జె.వసుంధర, యూపీ హెచ్ సి కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏఎస్ఐ కె.కష్ణమూర్తి పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం పరిసర ప్రాంతమైన ముసునూరు ఇందిరమ్మ కాలనీలో అనారోగ్య కారణంగా చనిపోయిన కొమరగిరి. భాస్కర్, అంత్యక్రి యలకు నేడు సంయుక్త సేవా సంస్థ ద్వారా గురువారం సంస్థ సభ్యుల సహకారంతో రూ.5వేలు అందజేయడం జరిగింది.సంస్థ గౌరవ సభ్యులు ఎం. అజిత్ బాబు, గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర వెల్లి భాస్కర్ కుటుంబసభ్యులకు నగదు అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ గౌరవ సభ్యులు ఎం. అజిత్ బాబు, గంధంప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ కొమరగిరి భాస్కర్ చనిపోయి నేటికి మూడు రోజులు గడిచినా తన భార్యకు, పిల్లలకు తాను చనిపోయిన విషయం తెలియక పోవడం బాధాక రంగా ఉందని తెలిపారు. చివరి చూపులకి కూడా తన భార్య, పిల్లలు నోచుకోకపోవడం తమకెంతో బాధకు గురిచేస్తోందని ఆవేదనను వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ఉన్న వారి బంధు వులు అంత్యక్రియలు నిర్వ హించ డానికి ఏర్పాట్లుచేయడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్, అంత్యక్రియలకు సహాయం అడిగిన వెంటనే స్పందించి సహాయం అందజేసిన తమ సంస్థ సభ్యులు ఎం.ఎస్.ఐ. పరమేశ్వరి, శాంతివర్ధన్, ఎం. అజిత్ బాబు, గంధం. ప్రసన్నాంజనేయులు, ఎఎస్ ఐ శ్రీనివాసులు, సాయి సౌమ్య రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, సిహెచ్.శ్రీనిధిలకు అభినందనలు తెలియజేశారు.


విరాళం అందజేస్తున్న సంయుక్త సేవా సంస్థ సభ్యులు

తాగునీరు అందించాలి

ప్రజాశక్తి-కావలి.

పట్టణంలో వారం రోజుల నుంచి నీటి సరఫరా జరగడం లేదని వెంటనే యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు పూర్తిగా నీటి సరఫరాను చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలో చాలామంది పేదలు మున్సిపల్ నీళ్లను తాగి జీవనం సాగిస్తుంటారన్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు రెండు రోజుల నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీళ్లు చాలీచాలడంలేదన్నారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అధికారుల చర్యలు నామమాత్రంగా ఉన్నా యని పట్టణంలో చాలా చేతిపంపులు చెడిపోయి ఉన్నాయన్నారు. మరమ్మతులకు చేతిపంపులను రిపేర్లుచేయలేద న్నారు.అంతేకాకుండా పైపులైన్స్ తరచుగా రిపేర్లు వస్తున్నందున ప్రజలకు సగం రోజుకు కూడా నీళ్లు అందడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా ఇప్పటికైనా వేసవిని దష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి బోర్లకు మరమ్మతులు వెంటనే చేయించా లన్నారు అవసరమైన దగ్గర కొత్త బోర్లను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు పూర్తి నీటిసరఫరా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎక్కడికక్కడ ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, కొండ బిట్రగుంట గ్రామంలో శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి 8వతేదీ వరకు జరుగు బ్రహ్మోత్సవాల కరపత్రాలను జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుకు ఆయన కార్యాలయంలో గురువారం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాలాద్రి ,ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆరవ రాధాకష్ణ అందజేసి మర్యాద పూర్వకంగా ఆహ్వానించామని తెలిపారు.


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

పందులను దూర ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి-అల్లూరు

విచ్చలవిడిగా పందులను రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పందుల యజమానులతో మాటాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విచ్చలవిడిగా సంచరిస్తూ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యజమానులే వాటిని సంరక్షించుకోవాలని తెలియజేశారు. పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని సంబంధిత విషయంపై అనేకమంది ఫిర్యాదు చేశారన్నారు.ఇళ్ల వద్దనే వాటిని ఉంచుకోవాలని ఇక అవి రోడ్లపై తిరిగితే దూరప్రాంతాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వివేకానంద, ఎఇ వినోద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

రెడ్‌బుక్ డే

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరిలో రెడ్ బుక్‌డే అనే మహోత్సవాన్ని అంతర్జాతీయంగా జరుపుతూ ఉన్నారని వక్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణం లోని సిపిఎం కార్యాలయంలో అంతర్జాతీయ రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సపిఎం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి వక్త మిరియం వెంకటేశ్వర్లు రెడ్ బుక్ డే గురించి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రెడ్ బుక్‌డే మహోత్సవాన్ని అంతర్జాతీయంగా జరుపుకున్నారు. ఎరుపునకు, విప్లవాలకు, మార్పునకు సంబంధించిన అభినయ పుస్తకాలు అన్నిటికీ ప్రపంచవ్యాప్తంగా చదివి వినిపించాలన్నారు. ముఖ్యంగా యువతీ యువకులను సిద్ధాంత పరంగా అభినయవాదంగా చైతన్యపరిచి రానున్న ఎన్నికలలో అభ్యుదయ భావాలు ఉన్నవారిని గెలిపించే విధంగా కషి చేసేందుకు దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాబు రెడ్డి, మీగడ వెంకటేశ్వర రెడ్డిని గెలిపించే విధంగా తీర్మానం చేశామని తెలిపారు. ఈ పిలుపును అంతర్జాతీయ కార్మిక వర్గం పిలిపించడం జరిగింది. ఈ పిలుపులో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు గంట లక్ష్మీపతి, మూలి వెంగయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందాని బాషా, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ప్రసాద్, ఐద్వా నాయకురాలు గుల్జారి బేగం, పలువురు ఉపాధ్యాయులు ఉద్యోగులు, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను తదితరులున్నారు.



మాట్లాడుతున్న మిరియం వెంకటేశ్వర్లు

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని మండలపరిషత్ సమావేశ మందిరంలో గురువారం తూతు మంత్రంగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు రాకపోగా ప్రజల సమస్యలను తీర్చాల్సిన అధికారులు పట్టీ పట్టనట్లు సమస్యలను తీర్చడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని నాయకులు ఆగ్రహించారు. ఎన్నికలు నియమావళి అమల్లో ఉన్నందున సర్దుమణిగారు.కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్రమణ్యం, తహశీల్దార్ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి

ర్యాగింగ్, డ్రగ్స్ నివారణపై అవగాహన


బిట్రగుంటలో మాట్లాడుతున్న డిఎస్‌పి


ఆత్మకూరులో మాట్లాడుతున్నసిఐ


ఇందుకూరుపేటలో మాట్లాడుతున్న దృశ్యం



కావలి లో మాట్లాడుతున్న డిఎస్‌పి

బిట్రగుంట

బోగోలు మండలం, కడనూతల గ్రామం జాతీయ రహదారి పక్కన ఉన్న రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ర్యాగింగ్, డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివి ఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కావలి డి.ఎస్.పి ఎం. వెంకటరమణ, కావలి రూరల్ సిఐ ఎం. రాజేష్, బిట్రగుంట ఎస్ఐ చిన్న బలరామయ్యలు పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్ నివారణపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి మాట్లాడుతూ ఒక చిన్న పొరపాటు చేస్తే ఒక నిండు ప్రాణాన్ని బలి చేసినట్లు అవుతారని తెలిపారు.డ్రగ్స్ బానిస అయితే జీవితాంతం ఎందుకు పనికి రాకుండా పోతారన్నారు.చెడు సావాసం చేయొద్దని, దుర్ వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, కళాశాలలో చిన్నచిన్న పొరపాటు జరుగుతూ ఉంటే వాటిని కళాశాల యాజమాన్యానికి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.లేనిపక్షంలో పోలీసు వారిని సంప్రదించాలన్నారు. రూరల్ సిఐ శ్రీ రాజేష్ మాట్లాడుతూ విద్యాసంస్థలలో ప్రస్తుత సమాజంలో జరుగుతున్నటువంటి వాస్తవ పరిస్థితులను విద్యార్థులకు అవగాహన కలిగించారు. అమ్మాయిలు సమాజంలో ఎలా మెలగాలి, ప్రతిదినం సమాజంలో జరుగుతున్నటువంటి సందర్భాలను ఉదాహరణలతో వివరించారు. ప్రతి ఒక్కరూ కళాశాలలో ఏమన్నా ఇబ్బంది జరిగినప్పుడు భద్రత కోసం 112 లేక 100 ఫోన్ చేసి రక్షణ పొందాలని విద్యార్థిని ,విద్యార్థులను సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. రాజారెడ్డి, ఎఒ ఆర్వి రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు ,విద్యార్థిని విద్యార్థులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కావలి

స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ " మధుకర్ ఆధ్వర్యంలో గురువారం యాంటీ ర్యాగింగ్ పై అవగాహనా సదస్సు నిర్వహించారు.విట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ "దత్తాత్రేయశర్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. డి.ఎస్.పి.వెంకటరమణ, ఒకటోపట్టణ సి.ఐ.శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ర్యాగింగ్ చాలా నీచమైన సంస్కతి అన్నారు.దీనివలన విద్యార్థుల మనసు గాయ పడుతుంద న్నారు. వారు క్షోభను అనుభవిస్తారని, ఒక్కోసారి ఆత్మహత్యలకు కూడా పాల్పడుతారన్నారు. సి.ఐ. మాట్లాడుతూ,ర్యాగింగ్ కు పాల్పడితే విద్యార్థులు పోలీస్‌లు, చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించుటవలన, భవిష్యత్తులో ఎంతగానో నష్టపడుతారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్ నివారణ గురించి అవగాహన కల్పించినందుకు కళాశాల కరెస్పాండెంట్ దొడ్ల విద్యాధర్ కుమార్ రెడ్డి, అకాడమిక్ చైర్మన్ డాక్టర్ "ప్రత్యుషా రెడ్డిలు వారిని అభినందించారు.


ఉదయగిరిలో మాట్లాడుతున్న సిఐ

ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ శివ శంకర్ రావుల ఆధ్వర్యంలో అక్కడి విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల జరిగే ఇబ్బందులు ఈవ్ టీజింగ్ వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల బోగోలు సమీపంలో ఓ విద్యార్థిని సహచర విద్యార్థులు ర్యాగింగ్ చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఎస్‌పి విజయరావు ఆదేశాలతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత చదువుల పట్ల మీ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులపై ఎన్నో ఆశలు పెట్టుకొని కాలేజీకి చదువుకోవడానికి పంపిస్తారన్నారు. ఇక్కడ స్నేహపూర్వక వాతావరణంలో ఒకరికొకరు స్నేహితులుగా ఉంటూ చదువులో పోటీపడి మంచి భవిష్యత్తు పొందాలని సూచిం చారు. క్షణికావేశంలో ఈవ్ టీజింగ్‌లకు ర్యాగింగ్‌కు పాల్పడి విలువైన ఉజ్వల భవిష్యత్తును కాలరాసు కోవద్దని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, కళాశాల అధ్యాపకులు హాజరయ్యారు

ఉదయగిరి

చదువుకునే దశలో విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకూడదని సిఐ వి. గిరిబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక రాజ మోహన్ రెడ్డిప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌పి ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. సిఐ గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ మంచి నడవడికను అవలంభించు కోవాలని, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. సెల్ ఫోను వాడకం తగ్గించి వ్యసనానికి బానిస కావొద్దు అని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థులకు వ్యాయామం చాలా అవసరమని వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినిలు ప్రతి ఒక్కరూ దిశా యాప్ ను సెల్ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. యాప్ మీ మొబైల్లో ఉంటే పోలీసు రక్షణ మీకు ఉన్నట్టే అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట

మాదకద్రవ్యాలతో యువతకు ముప్పు పొంచి ఉందని ఎస్ఈబి సిఐ బాలకష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నరసాపురం బాలాజీ విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత ఎక్కువ శాతం చెడు అలవాట్ల పై ఎక్కువ శాతం మొగ్గు చూపుతున్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, విద్యార్థులు మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా భవిష్యత్తుపై దష్టి పెట్టి ఉన్నత స్థితికి ఎదగాలని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం రవి, కిరణ్, లేనిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం


నెల్లూరు రూరల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

శాసనమండలిలో నిత్యం ప్రజల పక్షాన, ఉద్యోగుల నిరుద్యోగుల తరపున తమ వాణిని వినిపించే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రూరల్ మండల పరిధిలోని సౌత్ మోపూరు గ్రామంలో, 30వ డివిజన్ పరిధిలోని తెలుగుగంగ కాలనీ ప్రాంతంలో ప్రజాసంఘాలు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు గ్రాడ్యుయేట్స్ ఓటర్ లను కలిసి గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డికి, టీచర్స్ ఎంఎల్‌సి పి.బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సౌత్‌మోపూరు గ్రామంలో సిపిఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, మండల నాయకులు బాలు ఆదిశేషయ్య, జానా లక్ష్మీ ప్రసాదు, అచ్చి అనంతయ్య, రామా బత్తిన శంకరయ్య, పేరత్తూరు నాగరాజు, వలిపి ప్రసాదు, జమల్ల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు గంగ కాలనీ లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ కార్యవర్గ సభ్యులు కొండ ప్రసాద్ ,రూరల్ కమిటీ సభ్యులు కండె కోటేశ్వరరావు, శాఖ కార్యదర్శి పుల్లలచెరువు శ్రీనివాసులు రెడ్డి, శాఖ సభ్యులు నరికే శీనయ్య,నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం


అనంతసాగరంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

పిడిఎఫ్ ఎంఎల్‌సిలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాష కోరారు. గురువారం మండలంలోని అంగన్‌వాడీల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అన్వర్ బాష మాట్లాడుతూ ప్రజా సమస్య ల పరిష్కారం కోసం నిత్యం శాసన మండలిలో ప్రభుత్వాలను నిలదీసి అడుగుతున్నది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనన్నారు. మేధావుల సభకు మేధావులను పంపించాలని కోరారు. పట్టభద్రుల అభ్యర్థి మీగడ వేంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యునియన్ నాయకులు నాగమణి, సునీత, సుబ్బమ్మ, పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-కావలి

జమాతె ఇస్లామి హింద్ కావలి శాఖ.మానవత నైతికత ఉద్య మంలోభాగంగా గురువారం కావలిలోనిశ్రీసాయివిద్యనికేతన్ మరియు ఐ.పి.యస్కూల్స్ లో వ్యాసరచన పోటీవిజేతలకు బహుమతులు ఇవ్వడంజరిగింది. ఇందులో జిల్లా మహిళా బాధ్యులు ఫాతిమా, స్థానిక బాధ్యులు రఫీ, జిలానీ, కరీం బాషా, రిజ్వాన్ , సభ్యులు నూర్జహాన్, భుష్ర, హబిబా, సానియా,ఎస్.ఐ.ఓ. బాధ్యులు అబుల్ అలా, సైపుల్లః, షరీఫ్ పాలోగ్నారు.స్కూల్ హెడ్ మాస్టర్ హర్షద రెడ్డి టీచర్లు పాల్గొన్నారు.

ఐటి విభాగం అధ్యక్షులుగా 'కొప్పోలు'

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని రామానాయుడుపల్లి గ్రామానికి చెందిన కొప్పోలు వెంకటేశ్వర్లును జిల్లా ఐటి విభాగం అధ్యక్షులుగా వైసీపీ అధిష్టానం నియమిం చిందని తెలియజేశారు. దీంతోమండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బా ధ్యతను విస్మరించకుండా పార్టీ అభివద్ధికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డిలకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు.



టిడిపి సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్. అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ఉమ్మడి నెల్లూరు జిల్లా టిడిపి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిధులుగా పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మార్చి 13వ తేదీన జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన, ఓటర్ల జాబితా పరిశీలన, సెక్షన్ ఇంచార్జ్ ల నియామకం, జిల్లాలో నెలకొని ఉన్న సమస్యలు - చేపట్టవలసిన ఆందోళన కార్యక్రమాలు అజెండాగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరు నాగేశ్వరరావు, కోవూరు నియోజకవర్గ ఇన్చార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రూ.14 లక్షలతో సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి-బిట్రగుంట

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బోగోలు పంచాయతీ పరిధి బేతనీయ పేటలోలోని సిమెంటు రోడ్డును శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారంతో 14 లక్షలతో శాంక్షన్ అయిన రోడ్లను గురువారం మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అభివద్ధికి నోచుకోని రోడ్డును వైసీపీ ప్రభుత్వంలో శాసన సభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారంతో వేయిస్తు న్నందుకు ఆయనకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్‌పిటిసి కీర్తన, సర్పంచ్ పండిపాటి అనిత, ఎంపీటీసీ సభ్యురాలు కౌసల్య, వార్డ్ సభ్యురాలు సనమ్మ, నాయకులు తూపిరి పెంచలయ్య, స్థానికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నమద్దిబోయిన వీర రఘు

తప్పిన ప్రమాదం

ప్రజాశకి-సంగం

మండల కేంద్రంలోని వుడ్‌హౌస్ పేట గ్రామ సమీపంలోనీ జాతీయ రహదారిపై గురువారం ప్రమాదవశాత్తు ఓ గ్రావెల్ టిప్పర్ బోల్తా పడింది. సంగం నుంచి బుచ్చి వైపు వెళ్తున్న టిప్పర్ అకస్మాత్తుగా టైర్ పంచరయ్యింది.దీంతో టిప్పర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పెద్ద ప్రమాదం తప్పింది.

ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్త్ రాజుపాలెం శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటెల్ కంపెనీ ఆధ్వర్యంలో అత్యాధునిక సాఫ్ట్ వేర్‌లో కూడిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ప్రముఖ జర్మనీ అనుబంధిత విర్ట్ జన్ జోన్ డీర్ కంపెనీ ముఖ్య అతిథిగా ఛీఫ్ ఎగ్జి క్యూటివ్ ఆఫీసర్ పోలగిరి రమేష్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబునాయుడు పాల్గొన్నారు. కృత్రిమ మేధ ల్యాబ్ ను ప్రారంభించిన ముఖ్య అతిథి అధ్యాపకులు, విద్యార్థులను ఉద్యేశించి ప్రసంగిస్తూ తాను నెల్లూరు వాసిగా ఇప్పుడు పూణేలోని జర్మనీ అనుబంధిత విర్ట్ జెన్ జోన్ డీర్ కంపెనీ అధినేతగా మన రాష్ట్రంలో నెల్లూరు ఎప్పుడూ గుర్తుకొస్తుందన్నారు. శ్రీ వేంకటేశ్వర కళాశాల మేనేజర్ విద్యార్థులకు అందుతున్న ప్లేస్మెంట్, అకడమిక్స్ పోయిన సంవత్సరం జోన్ 2022న చూసినప్పుడు కాలేజీకి ఒక నెల్లూరు వాసిగా విర్ట్ జెన్ జోన్ డీర్ కంపెనీ సామాజిక బాధ్యత నిధుల నుంచి 28 లక్షలు ఇవ్వడం జరిగిందనీ తెలిపారు. ల్యాబ్ ను రూపొందించడం నెల్లూరు కే గర్వకారణం అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్ బాబు మాట్లాడుతూ కళాశాలలో సమకూర్చిన కత్రిమ మేధ ల్యాబ్‌లో ఐఎన్‌టి ఎల్ కంపెనీ ట్రైనర్లు ఆరు నెలలు కళాశాలలో ఉండి అవసరమైన డాటాసైన్స్, మెషీన్ లర్నింగ్ ఇంటర్నెట్ ఆఫ్ థాంగ్ మొదలగు విభాగాలలో అన్ని బ్రాంచ్ అధ్యాపకులకూ, అన్ని బ్రాంచి విద్యార్థులకూ ట్రైనింగ్ విత్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నెల్లూరు రైతు సంఘ అధ్యక్షుడును ప్రశంసించారు.



'హామీలు నెరవేర్చిన సిఎం'

ప్రజాశక్తి-కలిగిరి

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సిఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అభివద్ధి, సంక్షేమంలో గత ప్రభుత్వం కంటే. వంద రెట్లు ఎక్కువ పథకాలు ఇస్తున్నారన్నారు. పాద యాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేశారని, విద్యా, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్, ఎంఎల్‌సి ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు, మైనార్టీలకు ఎక్కువ అవకాశాలు కల్పించారన్నారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, పల్లాల కొండా రెడ్డి, మైనార్టీ నాయకులు, భవాని,వెంకీ, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు